## మంచి వార్త

# గ్రామీణ మహిళల కోసం..



**నగరాలు,** పట్టణాల్లో మెరుగైన వైద్య వసతులు ఉంటాయి. కాబట్టి, ఆరోగ్య సంరక్షణ తేలికే. అదే మారుమూల ప్రాంతాల్లో.. ముఖ్యంగా స్త్రీలు, బాలికల విషయంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఇప్పటికీ అంతంత మాత్రంగానే కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితిలో తెలంగాణలో మహిళల ఆరోగ్యం మెరుగుపడే దిశగా గైనకాలజిస్ట్ డాక్టర్ గోగుల గౌతమి రెడ్డి చొరవ చూపుతున్నారు. కరీంనగర్ పట్టణంలో 'గౌతమి మెటర్నిటీ హాస్పిటల్' పేరుతో ఓ దవాఖాన నడుపుతున్నారు డాక్టర్ గౌతమి. స్త్రీలు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందనేది ఆమె అభిమతం. అందుకే, గ్రామీణ మహిళల్లో ప్రధాన సమస్య అయిన రక్తహీనతకు అడ్డుకట్ట వేయడానికి డాక్టర్ గౌతమి ఓ మొబైల్ వ్యాన్‌ను ప్రారంభించారు. గౌతమి ఫౌండేషన్ ద్వారా క్రమం తప్పకుండా ఈ సంచార వాహనాలను ఇండ్ల ముందుకే తీసుకువెళ్తూ మహిళలకు రక్తహీనతకు సంబంధించిన హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. రక్తహీనత ఉన్న మహిళలకు ఉచితంగా మందులు ఇస్తున్నారు. ఆ సేవలకు తెలంగాణ ప్రభుత్వం కూడా అండగా నిలుస్తుండటం విశేషం. మొబైల్ వ్యాన్‌లో డాక్టర్ గౌతమి బృందం కరీంనగర్ గ్రామీణ ప్రాంతాలు, స్థానికంగా ఉండే బాలికల హాస్టళ్లను సందర్శిస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయులను నిర్ధారించడానికి నమూనాలను సేకరిస్తుంది. ఎవరికైనా 100 మిల్లీలీటర్ల (ఒక డెసీలీటర్) రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి 12 గ్రాములకు పడిపోతే కనుక ఫౌండేషన్ ఉచిత వైద్య సహాయం అందిస్తుంది. నెలరోజుల తర్వాత మళ్లీ హిమోగ్లోబిన్ స్థాయులను పరీక్షిస్తారు. దీనివల్ల పేద, మధ్యతరగతి మహిళలకు ప్రయోజనకరంగా ఉంటుందని డాక్టర్ గౌతమి అభిప్రాయం. నిజమే! రోజురోజుకూ వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో వైద్యులు సొంతలాభం కొంత మానుకుని.. ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తే సమాజం ఆరోగ్యవంతం కావడానికి బాటలు వేసినట్టే అవుతుంది.

## వైతాళికుల వాణి

ఏ అభిప్రాయాన్ని అయినా తిరస్కరించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ, దాన్ని వ్యక్తీకరించకుండా అడ్డుకునే హక్కు మాత్రం ఎవ్వరికీ ఉండదు.

• **పెరియార్ ఈవీ రామస్వామి నాయకర్ (ద్రవిడ సిద్ధాంత కర్త)**

## క్యా బాత్ హై!

